క్లుప్తంగా

ఐఎఫ్‌టీయూ మహాసభలకు తరలిరండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: ఈనెల 16, 17, 18వ తేదీల్లో తిరుపతిలో జరగనున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వై.గోపాల్‌రావు కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పడమటనర్సాపురంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 16న తిరుపతిలో కార్మికులతో భారీ ర్యాలీ, 17, 18వ తేదీల్లో దేశ వ్యాప్తంగా ఎంపికైన ప్రతినిధులతో మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అపర్ణ, బి.ప్రదీప్, జాతీయ కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజు, తులసి, శంకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

టేకులపల్లి: ఐకేపీ శాఖలో పని చేస్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించాలని టేకులపల్లి వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు చంద్రకళ కోరారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చరణ్, గౌసియా, జయ, శిరోమణి, శ్రీనుగోపాల్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడులో జరిగిన ఘటనకు నిరసనగా గురువారం పోస్టాఫీసు సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. ఆర్థిక, అధికార బలం ఉందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం విర్రవీగుతోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికార మార్పిడి కచ్చితంగా జరిగి తీరుతుందని జోస్యం చెప్పారు. ఘటనకు తొలి ముద్దాయి బీఆర్‌ఎస్ ప్రభుత్వమని తొమ్మిదేళ్ల పాలనలో పేదలకు న్యాయం చేయలేక, తిరిగి వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే దురుద్దేశ్యంతో దావతులు, సమ్మేళనాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, అమాయక ప్రజలు, పేదలంతా ఆత్మీయ సమ్మేళనాలకు దూరంగా ఉండాలని, అధికార పార్టీ బెదిరింపులు, బుజ్జగింపులకు లొంగి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేపై హత్యానేరం కింద క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. చీమలపాడు ఘటనలో క్షతగాత్రులకు, మృతుల కుటుంబాలకు బీఎస్పీ అండగా ఉంటుందని ఆ కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, సాయి, కోలా మల్లిక, నాగుల రవికుమార్, తాటిపాముల హరికృష్ణ, సందేల పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించండి



పిల్లల చదువులను పరిశీలిస్తున్న కనకదుర్గ

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలని సీడీపీఓ కనకదుర్గ ఆదేశించారు. మండలంలోని ఉల్వనూరు, మందేరకలపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని స్టాక్ రికార్డులను పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లల చదువులను సమీక్షించారు. మాట్లాడుతూ.. ప్రీస్కూల్‌కు పిల్లలను కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు, తిరిగి పంపించేటప్పుడు టీచర్లు, ఆయాలు జాగ్రత్తలు తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించాలని సూచించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో అక్షరాలు నేర్పి రెండుగంటల నుంచి గృహ సందర్శన చేయాలన్నారు. కార్యక్రమంలో ఉల్వనూరు సర్పంచ్ వాసం రుద్ర, ఉపసర్పంచ్ లక్ష్మణ్‌రావు, సూపర్‌వైజర్ వసంతరాణి పాల్గొన్నారు.

సమ్మె బాటలో వీఓఏలు

- పేస్కేల్ వర్తింపజేయాలని డిమాండ్
- సెర్ప్‌లో స్తంభించిన సేవలు.. ఆన్‌లైన్ సమీక్షలు
- ఆర్థిక లావాదేవీలపై తీవ్ర ప్రభావం



సెర్ప్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల నిర్వహణ, వారికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలలో గ్రామ సంఘాల సహాయకులది కీలకపాత్ర. సెర్ప్ ఆధీనంలో విధులు నిర్వహిస్తున్న వీరికి విధుల్లో చేరే నాటి నుంచి అరకొర వేతనంతో సరిపెడుతూ వచ్చారు. సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేసిన ప్రభుత్వం తమను విస్మరించడంపై వీఓఏలు అలకబూనారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పొదుపు సంఘాల ఉన్నతికి తోడ్పాటు నందిస్తున్న తమ సేవలను ప్రభుత్వం విస్మరించిందని రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విధులకు దూరంగా ఉంటున్నారు.

మొదటి నుంచీ ఇబ్బందులే..

2001లో పొదుపు సంఘాలు ఏర్పడినప్పుడు పుస్తక నిర్వహణ, బ్యాంకు లావాదేవీలు చూసుకునేందుకు ప్రభుత్వం గ్రామదీపికల పేరుతో ప్రతి సమాఖ్యకు ఒకరు చొప్పున నియమించింది. కానీ వేతనాలు చెల్లించడం లేదు. వీరిలో కొంతమందికి గతంలో పదోన్నతి కల్పించి క్లస్టర్ కోఆర్డినేటర్లుగా నియమించారు. గ్రామదీపికలను గ్రామ సంఘ సహాయకులు (వీఓఏ)గా పేరు మార్చి విధుల్లో కొనసాగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వీఓఏలకు కనీస వేతనం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో వీఓఏలు ఉమ్మడి రాష్ట్రంలో ఆందోళన బాట పట్టారు. స్పందించిన అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం రూ.2వేలు వేతనం చెల్లిస్తామని ప్రకటించి అమలు చేయలేదు. దీంతో పొదుపు సంఘాల నుంచి నెలకు రూ.వెయ్యి, రూ.1,500 తీసుకుంటూ కాలం వెళ్లదీశారు. 2017లో మరోసారి ఉద్యమబాట పట్టారు. స్పందించిన ప్రభుత్వం వేతనం ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నుంచి రూ.3వేలు, గ్రామ సంఘం నుంచి రూ.2 వేలు మొత్తంగా ప్రతి నెల రూ.5వేల వేతనం పొందేలా ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఆచరణలోకి రావడానికి ఏడాది సమయం పట్టింది. ఆ తరువాత వీఓఏలు మెరుగైన వేతనం కోసం తరచూ ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. అదే సమయంలో ఆందోళన బాటపట్టిన సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు వర్తింపజేస్తూ తమను విస్మరించడంపై వీఓఏలు భగ్గుమన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని 950 మంది వీఓఏలు మరోసారి సమ్మెకు పూనుకున్నారు.

సంఘాల నిర్వహణలో వీఓఏలదే కీలకపాత్ర..

గ్రామాలలో ప్రతి మహిళా కుటుంబంతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నది కేవలం వీఓఏలు మాత్రమే. మహిళలకు సమావేశాలు నిర్వహించడం, పొదుపు చేయించడం, అప్పుల చెల్లింపులు, ఉపాధి, ఆదాయ మార్గాలను కల్పించడం, నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేయడం, సంఘాలను బలోపేతం చేయడం, ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో వీరి పాత్ర ఎంతో ముఖ్యమైంది. మహిళలను ఆర్థిక పురోభివృద్ధి పట్ల, సామాజిక పరివర్తనపై చైతన్యం చేయడంలోనూ వీఓఏలదే ముఖ్య భూమిక.

ఇంత చేస్తున్నా తమకు కేవలం రూ.3వేలు గౌరవ వేతనం ఇస్తూ వెట్టి చాకిరీ చేయించుకోవడం ఎంత వరకు సమంజసమని వీఓఏలు ప్రశ్నిస్తున్నారు.

స్తంభించిన సేవలు... గతంలో చేసిన సమ్మె ద్వారా ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈ దఫా ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలని వీఓఏలు తీర్మానించుకున్నారు. వీఓఏల ద్వారా నిర్వహించే అన్ని కార్యక్రమాలను నిలిపివేశారు. ప్రధానంగా మహిళా సంఘాలతో ఆన్‌లైన్ సమావేశాలు నిలిచిపోయాయి. సంఘాల సంస్థాగత నిర్మాణం, ప్రభుత్వ ఆన్‌లైన్ కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. ఇదిలా ఉండగా పొదుపు సంఘాలు చెల్లించాల్సిన పొదు పు, అప్పులు, స్త్రీనిధి రుణాలను తిరిగి చెల్లించడంలో పొదుపు సంఘాల ప్రతినిధులే నేరుగా బ్యాంకుల్లో జమ చేయాలనే నిబంధన ఉండటంతో ఈ విషయంలో లావాదేవీలు కొంత వరకు ముందుకు సాగుతున్నాయి. వీఓఏల పర్యవేక్షణ లేకపోవడంతో లావాదేవీలు గతం కంటే పెద్దమొత్తంలో పెండింగ్‌లో ఉన్నట్లు సెర్ప్ అధికారులు చెపుతున్నారు.

పే స్కేల్ అందించాలి



సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా తమ విధులను కూడా రెగ్యులరైజ్ చేసి కూడా పేస్కేల్ వర్తింపజేయాలి. అరకొర గౌరవ వేతనంతో దశాబ్దకాలంగా విధులు నిర్వహిస్తూ పొదుపు సంఘాల బలోపేతానికి పని చేస్తున్నా ప్రభుత్వం మాపై కనికరం చూపడం లేదు. ఈసారి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అర్థం చేసుకొని పరిష్కరించాలని వేడుకుంటున్నాం. – బానోత్ మోతీలాల్, వీఓఏ

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



సుదీర్ఘకాలంగా విధుల్లో కొనసాగుతున్న వీఓఏల విధులను రెగ్యులరైజ్ చేయాలి. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ వర్తింపజేయాలి. అరకొర గౌరవ వేతనంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వం ఎప్పటికైనా న్యాయం చేస్తుందనే ఆశతో విధుల్లో నిర్వహిస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలి.

– సుల్తానా, వీఓఏ

కులమతాలు వేరైనా ఐక్యంగా ఉండాలి



సింగరేణి(కొత్తగూడెం): రంజాన్ తోఫా అందజేస్తున్న కూనంనేని సాంబశివరావు

సింగరేణి(కొత్తగూడెం): విద్వేషాలు లేని సమైక్య సమాజం కోసం అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని, కులాలు, మతాలు వేరైనా.. ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ సమభావంతో లౌకికతత్వంతో ముందుకు సాగుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని కూలీలైన్ 33వ వార్డులో పేద ముస్లిం కుటుంబాలకు టీఎస్‌ఆర్ ట్రస్ట్, ఎం.ఖాసీం అలీ సహకారంతో రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజులపాటు కఠోరమైన దీక్షతో ఉపవాసాలు ఉంటూ ఆకలి విలువ, అనురాగం ఐక్యత ప్రేమను చాటిచెబుతారన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్ పాషా, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి, వై.శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం రాజయ్య, చిలుక కృష్ణ, మరాటి మోహన్, సత్యనారాయణ, మోతుకూరి శంకర్, గూడెపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ముస్లింలకు అందిస్తున్న నూతన వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మసీదు ఆవరణలో నిర్వహించారు. గురువారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన 125 మంది నిరుపేదలకు రంజాన్ తోఫాలను టేకులపల్లి తహసీల్దార్ అబ్జుత్ పాషా అందజేశారు. దీంతోపాటు దావత్ నిర్వహించుకునేందుకు కమిటీ సభ్యులకు రూ.30వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడ సరిత, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మౌలానా, మతపెద్ద ఇనాయతుల్లా, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఐక్యత, స్నేహం ఇఫ్తార్‌కు నిదర్శనమని, ప్రతిఒక్కరూ సాటి వారితో సఖ్యతగా మెలగాలని ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆంబజార్ జామా మజీదులో ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముస్లింలకు ఇచ్చిన హామీ ప్రకారం 30 గుంటల భూమి షాదీఖానా కోసం త్వరలో అందజేస్తామన్నారు. ముస్లింలు ఉపవాస దీక్షల్లో వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయటం వారి త్యాగానికి, ఐక్యతకు చిహ్నమని, పవిత్ర రంజాన్ మాసంలో పాల్గొనటం తన అదృష్టమన్నారు.

కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, టీబీజీకేఎస్ నేత ఎస్.రంగనాథ్, టీఆర్‌ఎస్ నేతలు హాజరయ్యారు. అనంతరం స్వయంగా విందు భోజనం వడ్డించి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమ్మె



అవగాహన కల్పిస్తున్న మోహన్‌రావు

ఇల్లెందురూరల్: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 17వ తేదీ నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె కొనసాగుతుందని జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో గురువారం విద్యుత్ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లు, ఇప్పటి వరకు జరిగిన చర్చలను ఉద్యోగులకు సమగ్రంగా వివరించి అవగాహన కల్పించారు. 17వ తేదీ నుంచి చేపట్టనున్న సమ్మెలో ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పులి గణేష్, శివరంజని, గోవర్ధన్, హేమంత్ పాల్గొన్నారు.

నేటి సత్యాగ్రహ సభను జయప్రదం చేయండి



జూలూరుపాడు: మాట్లాడుతున్న రాందాస్ నాయక్

జూలూరుపాడు: నేడు మంచిర్యాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరగనున్న సత్యాగ్రహ సభను జయప్రదం చేయాలని టీపీసీసీ సభ్యుడు, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాళోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో జై భారత్ సత్యాగ్రహ దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. ఈ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. బొడ్డు కృష్ణయ్య, లకావత్ లచ్చు నాయక్, పమ్మి అశోక్, మందా బాబు, తాళ్లూరి అచ్చయ్య, చాపలమడుగు నరసింహారావు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జన్మదినం రోజున మంచిర్యాలలో జరగనున్న సత్యాగ్రహ సభకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యధికంగా తరలివెళ్లి విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకురాలు బానోతు విజయలక్ష్మి, బానోతు కిషన్ నాయక్‌లు కోరారు. గురువారం ఇల్లెందు ఐతా ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లాల్‌సింగ్, మురళీ, అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఏరియాలో జీఎం పర్యటన



సమీక్ష చేస్తున్న జీఎం రవికుమార్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో జీఎం (ఐ, పీఎం) ఎ.రవికుమార్ పర్యటించారు. గురువారం జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఓసీ కోసం సాగుతున్న పనుల వివరాలు, రెమిడేషన్ పనులలో భాగంగా ఓసీ ప్రభావిత గ్రామాలకు సింగరేణి సంస్థ ద్వారా చేసిన పనుల వివరాలను, కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా నిరుద్యోగ యువతకు, మహిళలకు కల్పిస్తున్న ఉచిత శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం రామారావు, వెంకటరామచంద్ర, మహేశ్వర్, సర్వేయర్ మంగీలాల్ పాల్గొన్నారు.

బోరు బావి ఏర్పాటు



డ్రిల్లింగ్ ప్రారంభిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పడమటనర్సాపురం శ్రీపెద్దమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో భక్తుల తాగునీటి అవసరాల కోసం గురువారం బోరు బావి నిర్మించారు. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం యువజన నాయకుడు లేళ్ల గోపాల్‌రెడ్డి తన సొంత ఖర్చులతో బోరు బావి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా భూమి పూజ నిర్వహించి బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు. వార్డు సభ్యుడు హరీష్, ఆలయ కమిటీ సభ్యులు సంగం నాగరాజు, బూరం రమేష్, పోతిని సత్యం, సంగం లక్ష్మీనారాయణ, నరసింహారావు, కాసిని వెంకటేశ్వర్లు, బూరుగు నరసింహారావు, గనప వెంకన్న పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న స్థానికులు

పాల్వంచరూరల్: జీఎస్‌ఆర్ ట్రస్ట్ యువసేన ఆధ్వర్యంలో మండలంలోని పాయకారి యానంబైల్ గ్రామంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిట్టల సంపత్‌కుమార్, సర్ప అశోక్, స్థానికలు పాల్గొన్నారు.

అభివృద్ధే అస్త్రం.. సంక్షేమమే సమాధానం



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

టేకులపల్లి: అభివృద్ధే అస్త్రంగా, సంక్షేమ పథకాలే సమాధానంగా ముందుకు సాగుతున్నామని, ఎనిమిదేళ్లలో ప్రజల హృదయాల్లో బీఆర్‌ఎస్ బలంగా నాటుకుపోయిందని ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు ఎఫ్‌డీఆర్ నిధులు రూ.2.50 కోట్లతో కోయగూడెంలో నిర్మించతలపెట్టిన హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ వెళ్లిపోయారు. ఆ తరువాత కోయగూడెం గ్రామంలో జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలు అభివృద్ధిని కళ్లారా చూస్తున్నారని, సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్నారని దీనికంటే ఇంకేం కావాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఇల్లెందు నియోజకవర్గంలోని ప్రతి మారుమూల గ్రామాల్లో కూడా సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ పార్టీని విమర్శించే వారికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు లబ్ధిపొందుతున్న వారే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హనుమాతండా రోడ్డుకు, కోయగూడెం పంచాయతీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని తప్పనిసరిగా నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, ఎంపీటీసీ జాల సంధ్య, ఏఎంసీ చైర్మన్ బాణోతు హరిసింగ్‌నాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, దళపతి శ్రీనివాస్‌రాజు, సర్పంచ్‌లు సురేందర్, రాజేందర్, నిర్మల, చిన్ని, బోడ సరిత, బొమ్మెర్ల వరప్రసాద్, చీమల సత్యనారాయణ, అక్కిరాజు గణేష్, లక్కినేని శ్యామ్, జాటోతు నరేష్, ఉండేటి బసవయ్య, రాకేష్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

18న హైదరాబాద్‌లో అఖిలపక్షం ధర్నా



మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో ఇటీవల ప్రశ్నపత్రాల లీకేజీ కేసును సీబీఐకి అప్పజెప్పాలని బాధ్యులు తమ ఉద్యోగ బాధ్యతల్లో ఉండరాదని, కొత్త బోర్డు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ బి.బాలశౌరి, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం పట్టణంలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో అఖిల పక్ష రాజకీయ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. పరీక్షలు వాయిదా వేయటం వలన నష్టపోయిన విద్యార్థులకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలన్నారు. అంతే కాకుండా జరిగిన పరీక్ష పేపర్ల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగే ధర్నాలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువకులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మల్లెల రామనాథం, బానోత్ ధర్మా, పీడీఎస్‌యూ నాయకులు సంధ్య, రాజేశ్‌కుమార్, రాజశేఖర్, కావేరి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

సుజాతనగర్: తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఆ పార్టీ జాతీయ మోర్చా మీడియా కోఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు అన్నారు. పల్లెపల్లెకు ఓబీసీ–ఇంటింటికి బీజేపీ.. కార్యక్రమంలో భాగంగా సర్వారం గ్రామంలో గురువారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మన్ననలు పొందుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలలో ప్రజలు విసుగెత్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అసెంబ్లీ కన్వీనర్ నరేంద్రబాబు, మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెర్వు శ్రీనివాసరావు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధం నాగేంద్ర ప్రసాద్, కోశాధికారి జల్లారపు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బూరుగు ప్రసాద్, కాకటి నరేష్, భూక్యా బాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఇల్లెందురూరల్: జెండా వందనం చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం పతాకాన్ని జిల్లా కార్యదర్శి జయరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్ యూటీఎఫ్ నిరంతరం ముందుండి పోరాటం చేస్తోందన్నారు. పండిట్, పీఈటీ పోస్టుల అప్‌డేషన్ కోసం ఉపాధ్యాయులకు పదోన్నతులు, పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ప్రతినెల ఒకటో తేదీన ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంబాబు, శేషగిరిరావు, రమేష్, మంగతాయి, వీరన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే లక్ష్యం

పాల్వంచ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టీఎస్ యూటీఎఫ్ కృషి చేస్తుందని జిల్లా కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రాంతీయ కార్యాలయం వద్ద బండి జానకీరాములు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సంఘటితంగా పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సంఘ నిర్మాణ కర్త చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలు సాధించాలన్నారు. భవిష్యత్‌లో సంఘం తీసుకునే నిర్ణయాలపై కట్టుబడి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.యాకూబ్ పాషా, ఉపాధ్యక్షులు బి.మంగీలాల్, ఏఎస్‌ఆర్, ఎ.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, మోహన్‌రావు, రహీముద్దీన్, సంతోష్, రాజులు, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే నివాళి

సుజాతనగర్: కొత్తగూడెం సొసైటీ డైరెక్టర్, సర్వారం గ్రామ పంచాయతీకి చెందిన మాలోత్ సేవ్యా మృతికి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు గురువారం నివాళులర్పించారు. సేవ్యా మృతి చెందాడనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి గృహానికి వచ్చి సేవ్యా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చారు. సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



టేకులపల్లి మండలం రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డ మార్గంలోని పల్లెప్రకృతి వనం ఎదురుగా విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. స్తంభం రోడ్డువైపునకు ఒరిగి ఉండడంతో ఈదురు గాలులు వీస్తే కూలుతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఏదైనా ప్రమాదం జరగకముందే విద్యుత్ శాఖాధికారులు స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : హెచ్ దేవా, ఏఈ, విద్యుత్ శాఖ
సెల్ నంబర్ : 9440811562

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ - 79979 58226 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416